
నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్ - నిర్మల్
10 | నిజామాబాద్ శనివారం 26 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL







# రజతోత్సవ సభకు రెడీ!

## సన్నద్ధమైన గులాబీ సేన

- శ్రేణులను ఏకం చేస్తున్న ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు
- ఇప్పటికే నియోజకవర్గాల్లో విస్తృతంగా సభలు, సమావేశాలు
- వాహనాలు.. రూట్ మ్యాప్ సిద్ధం చేసుకున్న నాయకులు, కార్యకర్తలు
- స్వచ్ఛందంగా తరలి వెళ్లేందుకు ఉత్సాహం
- మరోసారి సత్తా చాటే దిశగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా

మంచిర్యాల, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు సర్వం సిద్ధం కాగా, స్వచ్ఛందంగా తరలివెళ్లేందుకు గులాబీ సేన సన్నద్ధమైనది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి దాదాపు 40 వేల మంది కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరుకానుండగా, అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసింది.

**ఆవిర్భావం నుంచి బీఆర్ఎస్ వెన్నంటే..**

2001లో బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ వెన్నంటే ఉన్నది. ఇప్పుడు మరోసారి అండగా నిలిచేందుకు సిద్ధమైంది. 14 ఏండ్ల సుదీర్ఘ ఉద్యమం చేసి స్వరాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్. పదేండ్ల పాలనలో అనేక అద్భుతాలు చేసింది. వ్యవసాయ రంగం మొదలు.. ఐటీ వరకు.. ఇలా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపింది. ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన రైతుబంధు, రుణమాఫీ, రైతు బీమా, పట్టణ, పల్లె ప్రగతి, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌వంటి పథకాలు చరిత్రలో నిలిచిపోయాయి. పొరుగున ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం సైతం తెలంగాణలో అధ్యయనం చేసి బీఆర్ఎస్ పథకాలను అనుసరించాయి. కొత్త జిల్లాల ఏర్పాటు, నియోజకవర్గాల్లో అభివృద్ధి పరుగులు పెట్టింది. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణలో బీఆర్ఎస్ మార్క్ పాలన కనిపించడం లేదు. రైతుల ఆత్మహత్యలు మళ్లీ మొదలయ్యాయి. పంట పెట్టుబడి సాయం రైతుబంధు రాకుండా పోయింది. రుణమాఫీ అరకొరగా అందింది. ఒకప్పుడు తెలంగాణలో కళకళలాడిన వ్యవసాయం తిరోగమన దిశలోకి వెళ్లిపోయింది. నీరు లేక పంటలు ఎండిపోయే దుస్థితి దాపురించింది. ఆరు గ్యారెంటీల అమలులో అధికార పార్టీ ఘోరంగా విఫలమైంది. ఏ ఒక్క పనీ.. సరిగా చేసి చూపింది లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో విచిత్రమైన పరిస్థితి నెలకొన్నది. ఏ ఒక్క వర్గం కూడా ఆనందంగా లేదనేది సుస్పష్టంగా కండ్ల ముందు సాక్షాత్కరిస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ ప్రాధాన్యత సంతరించుకున్నది. పాలనపై జనాలు మండిపడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ సభను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది. అధికారం కోల్పోయాక నిర్వహిస్తున్న తొలి సభను విజయవంతం చేసి.. బీఆర్ఎస్ సత్తా చాటేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నది.

**పార్టీ శ్రేణుల సమాయత్తం..**

రజతోత్సవ సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడంపై అధినేత కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నెలలో జిల్లాల వారీగా పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. సభను విజయవంతం చేయడానికి చేయాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షులు, ని యోజక వర్గాల ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు పార్టీ శ్రేణులను ఏకం చేశారు. ఎక్కడికక్కడ సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఉమ్మడి జి ల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు జరిగాయి. నియోజకవర్గానికి మూడు వేల మందిని సభకు తరలించేలా కార్యాచరణ రూపొందించారు. అన్ని మండలాల్లోనూ సమావేశాలు నిర్వహించి పార్టీ కా ర్యకర్తలను సిద్ధం చేశారు. దీంతో చాలా మంది స్వచ్ఛందంగా సభకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గానికి మూడు వేల మంది అనుకుంటే.. నాలుగు వేల నుంచి ఐదు వేల మంది తరలివచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నా రు. లక్ష్యానికి మించి గులాబీ సైన్యం సభకు వెళ్లే అవకాశాలున్నాయి. సభ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు విస్తృతంగా సభలు, సమావేశాలు నిర్వహించడం పార్టీకి కలిసి వచ్చింది. ఎక్కడ మీటింగ్ పెట్టినా అద్భుతమైన స్పందన లభించింది. పార్టీలో తిరిగి చేరికలు ప్రారంభమయ్యాయి. రజతోత్సవ సభలో అధినేత కేసీఆర్, పార్టీ కార్యవర్గం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి 100 శాతం కట్టుబడి పని చేసేందుకు గులాబీ సైన్యం సిద్ధమైంది. ఎక్కడ చూసినా రజతోత్సవ సభ గురించి, కేసీఆర్ ఏం మాట్లాడుతారా.. ఏం పిలుపునిస్తారా..? అనే చర్చ ఆసక్తిగా నడుస్తున్నది.

**సత్తా చాటేందుకు సిద్ధం**

రజతోత్సవ సభలో ఉమ్మడి జిల్లా సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఆయా జిల్లాల్లోని అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. అధినేత దిశానిర్దేశం మేరకు భారీగా సభకు ముఖ్య కార్యకర్తలు, నాయకులను తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా లెక్క చేయకుండా పార్టీ శ్రేణులు సభకు వెళ్లేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి 60 నుంచి 70 బస్సులను సిద్ధం చేశారు. ఇవేగాకుండా కార్లలోనూ ముఖ్యనాయకులు, అభిమానులు తరలివెళ్లనున్నారు. ద్విచక్రవాహనాలపై ర్యాలీగా మరి కొందరు వెళ్లనున్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఉదయాన్నే గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించాలని నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రతి గ్రామానికీ అవసరమైన భారీ గులాబీ జెండాలను సరఫరా చేశారు. ఉదయాన్నే జెండాలు ఎత్తుకొని బస్సుల్లో బయల్దేరి వెళ్లేందుకు రూట్‌మ్యాప్‌లను సిద్ధం చేసుకున్నారు. మధ్యాహ్నం భోజనాలు చేసుకొని నేరుగా సభా ప్రాంగణానికి వెళ్లాలని, ట్రాఫిక్‌లో ఇరుక్కుపోకుండా సభకు ముందుగానే వెళ్లేలా సమయాత్తం అవుతున్నారు. ఈ మేరకు బస్సులు ఎక్కడికి వస్తాయి.. ఒక్క బస్సులో ఎంత మంది వెళ్లాలి.. మధ్యాహ్న భోజనం ఎక్కడ ఏర్పాటు చేశారు ? అనే వివరాలన్నీ ఇప్పటికే ఇన్‌చార్జిలకు అందజేశారు. ఈ మేరకు పక్కా ప్రణాళికతో ఉమ్మడి జిల్లా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు సభకు తరలివెళ్తున్నారు. ఈ రజతోత్సవ సభ జిల్లాలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావడంలో కీలక భూమిక పోషించనున్నదని పార్టీ నాయకులు, కార్యకర్తలు విశ్వసిస్తున్నారు.



వరంగల్ జిల్లా ఎల్కతుర్తి వద్ద బీఆర్ఎస్ సభ ప్రాంగణం

## సభకు ఇలా వెళ్దాం

### ఎల్కతుర్తి వేదికకు సులువుగా చేరేలా రూట్‌మ్యాప్

ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభా ప్రాంగణానికి సులువుగా చేరుకునేలా జోన్ల వారీగా రూట్ మ్యాప్‌లను సిద్ధం చేశారు. లక్షలాదిగా తరలి వచ్చే బీఆర్ఎస్ బంధుగణం కోసం 5 జోన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా జోన్ల వారీగా ప్రత్యేకంగా 5పార్కింగ్ జోన్లను సైతం సిద్ధం చేశారు. సభా ప్రాంగణానికి మొత్తం 4 రహదారుల గుండా వాహనాలు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

**సిద్దిపేట-హుస్నాబాద్ నుంచి:** ఇది 765వ డీజీ జాతీయ రహదారి. ఈ రూట్ నుంచి మెదక్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలు సహా వెస్ట్ ఆదిలాబాద్ (ఆదిలాబాద్, నిర్మల్, బోథ్, ఖానాపూర్ నియోజక వర్గాలు) నుంచి కార్యకర్తలు వస్తారు.

**పార్కింగ్ జోన్ 5:** సిద్దిపేట జాతీయ రహదారి 765(డీజీ) మీదుగా సిద్దిపేట, హుస్నాబాద్, ముల్కనూరు, గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్, ఇందిరానగర్ మీదుగా ఈ పార్కింగ్ జోన్-5కు చేరుకునేలా ఏర్పాట్లుచేశారు. మరో రూట్‌లో వేలేరు, కొత్తకొండ, ముత్తారం వైపు నుంచి పార్కింగ్ జోన్-5కు చేరుకునేలా ఏర్పాట్లు ఉన్నాయి. మరో రూట్ అయిన కరీంనగర్ మీదుగా వచ్చే వాహనాలు కోతులనడుమ మీదుగా దారి మళ్లించుకుని గోపాల్‌పూర్, గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్, సిద్దిపేట జాతీయ రహదారి మీదుగా ఇందిరానగర్ నుంచి పార్కింగ్ జోన్-5కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

## ఆదిలాబాద్ జిల్లా నుంచి తరలనున్న 10 వేల మంది

ఆదిలాబాద్, ఏప్రిల్ 25 ( నమస్తే తెలంగాణ): ఈ నెల 27న వరంగల్ జిల్లాలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఆదిలాబాద్ జిల్లా గులాబీ శ్రేణులు సన్నద్ధమయినట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న తెలిపారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల నుంచి 10వేల మంది వరంగల్ సభకు హాజరవుతారని ఇందు కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. వరంగల్ సభకు పట్టణం, పల్లె తేడా లేకుండా అంద రూ హాజరవుతారని ఇందుకోసం రవాణా సౌకర్యం కల్పించామన్నారు. జిల్లా నుంచి 30 ఆర్టీసీ బస్సులు 150 క్రూజర్లుతో పాటు సొంత వాహనాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు వస్తారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగం వినేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని, తమ అంచనాలు మించి సభకు తరలిరానున్నట్లు చెప్పారు. ఎండల తీవ్రత కారణంగా ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జోగు రామన్న

**ఇన్‌చార్జిల నియామకం**

జిల్లాలో ఇప్పటికే గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి వరంగల్‌కు వచ్చే వారి వివరాలు సేకరించామని, ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాహనాలకు ఇన్‌చార్జిలను నియమించామన్నారు. వారు కార్యకర్తలను తీసుకుపోయి క్షేమంగా తిరిగి తిరిగివచ్చేలా బాధ్యతలు తీసుకుంటారన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని 49 వార్డులు ఉండగా వార్డుల వారీగా బస్సులు అందుబాటులో ఉంచామని ఉదయం టిఫిన్స్ చేసిన తర్వాత రాంలీలా మైదానం నుంచి బస్సులు వరంగల్‌కు బయలుదేరుతాయన్నారు.

**సభ తర్వాత కాంగ్రెస్, బీజేపీల మనుగడ ప్రశ్నార్థకం..**

కాంగ్రెస్ 15 నెలల పాలనపై ప్రజలు విసుగు చెందారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలు మోసం చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు నిలిచిపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలు తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని, సభ తర్వాత కాంగ్రెస్‌తో పాటు బీజేపీ పార్టీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు.

# కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్
- బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

ఖానాపూర్, ఏప్రిల్ 25: ప్రతి కార్యకర్తకూ బీఆర్ఎస్ అండగా ఉంటుందని పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ తెలిపారు. శుక్రవారం ఖానాపూర్ పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో కడెం, జన్నారం, ఉట్నూర్‌కు చెందిన బీజేపీ, ఇతర పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో మండల నాయకులు, కార్యకర్తలు జాన్సన్ నాయక్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులు, పథకాలు చూసి బీఆర్ఎస్‌లో చేరినట్లు కార్యకర్తలు చెప్పారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని జాన్సన్ నాయక్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చేసిన పనులు శూన్యం పేర్కొన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. 'జై కేసీఆర్, జై బీఆర్ఎస్, జై జాన్సన్ నాయక్' అంటూ కార్యకర్తల నినాదాలతో పట్టణం హోరెత్తింది. పార్టీలో చేరిన వారిలో డాక్టర్ ప్రేమ్ కుమార్, వెంకటేశ్, సురేశ్, చమటి, వెంకటరమణ, రాజు, అనిల్, గోపాల్ ఉన్నారు.



బీజేపీ నాయకులు, కార్యకర్తలకు కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న జాన్సన్ నాయక్

# ఉగ్రవాదుల దాడి దుర్మార్గపు చర్య

- మాజీ మంత్రి జోగు రామన్న
- పహల్గాం మృతులకు నివాళి

ఎదులాపురం, ఏప్రిల్ 25 : జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాద దాడి హేయమైన చర్య అని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఉగ్రదాడిలో మరణించిన వారికి ఆదిలాబాద్‌లోని సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గోపాలకృష్ణ మఠం వద్ద మృతుల చిత్రపటాల వద్ద రెండు నిమిషాలు మౌనం నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడులు చేసి ఇద్దరు విదేశీయులతో సహా 28 మందిని చంపారన్నారు. కులమతలు, పార్టీలకు అతీతంగా ఉగ్రవాద చర్యలను ఖండించాలన్నారు. ఉగ్రవాదులపై చర్యలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖండ భారత దేశాన్ని విచ్ఛినం చేయడానికే ఉగ్రదాడులు జరుగుతున్నాయని, దీన్ని ప్రతి ఒక్కరూ గమనించి ఐక్యంగా వాటిని ఎదుర్కొవాలని గోపాలకృష్ణమఠాధిపతి యోగనంద సరస్వతి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కమార్ ఖత్రి, బీఆర్ఎస్ నాయకుడు యూనీస్ అక్బానీ, ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ కొత్తవార్, బీజేపీ నాయకురాలు సుహాసిని రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే వయోవృద్ధుల సమాఖ్య, అంబేద్కర్ సంఘాలు, ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ తీసి నివాళులర్పించి, ఉగ్రవాద చర్యలను ఖండించారు.




ఆదిలాబాద్‌లో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు


**నల్లబ్యాడ్జీలతో ముస్లింల నిరసన**

బోథ్, ఏప్రిల్ 25 : పహల్గాంలో జరిపిన ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా శుక్రవారం ప్రార్థనల అనంతరం బోథ్ మండలం సొనాలలోని జామా మసీదు ప్రాంగణంలో ముస్లింలు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. మృతి చెందిన పర్యాటకులకు సంతాపం తెలిపారు. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ముస్లింలు, యువకులు కోరారు.

# కేసీఆర్ అన్నం పెట్టిండు.. కాంగ్రెస్ నీళ్లయినా ఇస్తలేదు

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- తాంసి మండలంలో కాంగ్రెస్‌కు బిగ్ షాక్
- బీఆర్ఎస్‌లో చేరిన 250 మంది హస్తం పార్టీ కార్యకర్తలు

తాంసి, ఏప్రిల్ 25 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత రైతులకు మూడెకరాల భూమి ఇచ్చి ఉపాధి కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపి అన్నం పెట్టారని..అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఆ రైతులకు కనీసం నీళ్లు కూడా ఇస్తలేదని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని జామిడి గ్రామంలో తాంసి మండల కాంగ్రెస్ యువజన నాయకుడు అశోక్ ఆధ్వర్యంలో 250 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అప్పులు చేస్తున్నదని అభివృద్ధి చేయడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారని కొనియాడారు. ముందుగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు మంగళహారతులు డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. నూతనంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని ప్రారంభించి చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో గద్దెనెక్కి ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమయిందన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇచ్చి కేసీఆర్ అన్నం పెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం జామిడి గ్రామంలో 18 మంది రైతులకు బోర్లు తవ్వించి సాగునీరు అందించడం లేదని మండిపడ్డారు. ఆ రైతుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాంగ్రెస్ రాగానే మళ్లీ సమైక్య రాష్ట్రంలోని పాత రోజులు వచ్చాయని కరెంటు కోతలు ప్రజలను వేధిస్తున్నాయని, కల్యాణలక్ష్మితో తులం బంగారం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఆసరా పింఛన్ల పెంపు, మహాలక్ష్మి పథకంలో మహిళలకు ప్రతి నెలా రూ.2500 ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. 'పథకాలు ఇస్తాం అన్నాం.. కానీ అధికారంలోకి వస్తామని అనుకోలేదు' అని కాంగ్రెస్ పార్టీ నాయకులే రచ్చబండల వద్ద వాపోతున్నారని ఎద్దేవా చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తప్పక గుణపాఠం చెబుతారని చెప్పారు. ఎన్నికలెప్పుడు వచ్చినా బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని కేసీఆర్ మరో సారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, మండల కన్వీనర్ వినోద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణ బీఆర్ఎస్ నాయకులు తాజా మాజీ సర్పంచ్ స్వప్న రత్నప్రకాశ్, మలపతి అశోక్, తిరుమల్ గౌడ్, ప్రీతం రెడ్డి, మహేందర్, రఘు, రజినీకాంత్ రెడ్డి, ఉత్తం, అండె అశోక్, భూమన్న, సాయినాథ్, సురేశ్, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



తాంసి : 'జై కేసీఆర్' అంటూ నినాదాలు చేస్తున్న జామిడి గ్రామస్తులు, నాయకులు

**రజతోత్సవ సభను విజయవంతం చేయాలి**

వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవ సభను బోథ్ నియోజకవర్గంలోని ప్రజలు బీఆర్ఎస్ నాయకులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు, అభిమానులు సకాలంలో హాజరయ్యేలా మండలాల నాయకులు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

**ముథోల్ నియోజకవర్గంలో**

భైంసా, ఏప్రిల్, 25 : కేసీఆర్ త్యాగంతో ఏర్పడిన ప్రత్యేక రాష్ట్రంలో గులాబీ జెండానే ప్రజలకు అండ అని ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యురాలు డాక్టర్ పడకంటి రమాదేవి అన్నారు. శుక్రవారం తన నివాసంలో కుంటాల మండలం లింబా (బీ) గ్రామ మాజీ సర్పంచ్ పెద్దకాపు గజ్జారాం, ముథోల్ మండలం మచ్కల్ గ్రామానికి చెందిన పుండలిక్, అవదూత్ బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి రమాదేవి ఆహ్వానించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు, నాయకులు భారీగా తరలిరావాలని ఆమె కోరారు.



భైంసా : లింబా (బీ) మాజీ సర్పంచ్‌కు పార్టీ కండువా కప్పుతున్న పడకంటి రమాదేవి